నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 22 నవంబర్ 2024
YADADRI BHUVANAGIRI

## ఎంజీయూ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ హుస్సేన్, రిజిస్ట్రార్, సీఓఈ

రామగిరి, నవంబర్ 21: మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి జిల్లాలోని పీజీ కళాశాలల సెమిస్టర్ –2, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ –1 పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో గురువారం తన చాంబర్‌లో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. ఫలితాలను www.mguniversity.ac.inలో అందుబాటులో ఉంచినట్లు సీఓఈ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. పీజీ రెండో సెమిస్టర్‌కు 62శాతం, ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 46శాతం ఫలితాలు నమోదైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, అసిస్టెంట్ కంట్రోలర్ లక్ష్మీప్రభ, సంధ్యారాణి, పరీక్షల పీజీ కోఆర్డినేటర్స్ భిక్షమయ్య, చిల్కూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచరణ వైఫల్యం... ప్రచార ఆర్భాటం

## ఏడాది పాలనలో అన్నీ ఎగనామాలే..

- అడ్రస్సు లేని ఆరు గ్యారెంటీలు
- ఉచిత బస్సుతోనే ఊదరగొట్టుడు
- అసంపూర్ణంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గృహ జ్యోతి
- రైతు భరోసాకు ఎగనామం.. సగంలోనే రుణమాఫీ
- సన్నాలకే బోనస్ అంటూ బోగస్ ఎత్తుగడలు
- దిక్కులేని పెన్షన్ల పెంపు, ఇందిరమ్మ ఇండ్లు
- ఎండమావులను తలపిస్తున్న ఎన్నికల హామీలు
- కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో ఆగ్రహం




*'ఏరు దాటిన దాక ఓడ మల్లయ్య... దాటాక బోడి మల్లయ్య' చందాన్ని తలపిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన తీరు. అధికారం కోసం అడ్డదిడ్డంగా హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కినాక కొత్త పథకాలు ఏమో కానీ ఉన్న పథకాలకు మంగళం పాడుతున్నది. ఆరు గ్యారెంటీల అమలు పేరుతో అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గర పడుతున్నా నేటికి వాటి అతీగతీ లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ఒక్కటి అమలు చేస్తూ... దాన్నే ఏడాది కాలంలో ఊదరగొడుతుండడం విశేషం. ఇక 200 యూనిట్ల ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్‌కు 500రూపాయల రాయితీ పథకాలు కూడా అసంపూర్తిగానే అమలవుతున్నాయి. ఇక మిగిలిన ఏ పథకమూ ఆచరణలోకి రాలేదు. కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా అమలు చేస్తూ వచ్చిన రైతుబంధును పక్కన పెట్టేశారు. రైతుభరోసాగా పేరు మార్చినా కార్యరూపం దాల్చలేదు. రుణమాఫీ సగంలోనే ఆగిపోయింది. ఇక 4 వేల పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు రూ.2,500 పథకం ఇంకా ఎన్నో హామీలు నేటికీ అడ్రస్సు లేకపోవడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్.. ఏడాది ప్రజా పాలన పేరుతో విజయోత్సవాల నిర్వహణకు సిద్ధపడడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.*

*– నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ)*

అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి ఏడాదిలోనే 2లక్షలు ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటలన్నీ ఉత్తవేనని తేలిపోయింది. రోజులు గడుస్తున్నా కొద్దీ ఇది మాటల ప్రభుత్వమేనని, చేతల ప్రభుత్వం కాదని తేటతెల్లమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది కాలంలో కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులేమీ లేకపోగా ఉన్నవాటిని ముందుకు తీసుకుపోవడంలో వైఫల్యం చెందారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత కేసీఆర్ సర్కార్ హయాంలో రైతుబంధు పథకం ద్వారా సుమారు 11 లక్షల మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.1,300 కోట్ల వరకు పెట్టుబడి సాయం అందేది. దీన్ని ఎకరాకు రూ.7,500 చొప్పున పెంచి ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. కానీ యాసంగిలో కేసీఆర్ సర్కార్ ఇచ్చిన సొమ్మునే ఇవ్వగా... వానకాలంలో అసలుకే ఎగనామం పెట్టింది. వానకాలంలో రైతుభరోసాగా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.2,000 కోట్ల వరకు అందాల్సి ఉంది. కానీ రైతుభరోసా సీజన్ ముగిసినా ఇవ్వకుండా గాలికి వదిలేసింది. ఇక యాసంగిలో సైతం ఇస్తారన్న గ్యారెంటీ ఏమీ కనిపిస్తలేదు. దీంతో రైతులు ఈ సీజన్‌లో పంటల పెట్టుబడి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇక ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని సైతం అర్ధాంతరంగా నిలిపివేశారు. ఉమ్మడి జిల్లాలో నేటికి రెండున్నర లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. మూడు విడుతల్లో కలిపి కూడా 50శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగింది. గత ఆగస్టు 15వ తేదీ నుంచి నేటి వరకు ఒక్క రైతుకు కొత్తగా రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డు లింక్ పెట్టి కుటుంబాలను లెక్కించి లబ్ధిదారులను తగ్గించే కుట్రలను చేసింది. దీంతో వేలాది మంది రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. వీరికి ఎప్పటికీ రుణమాఫీ అవుతుందనేది ప్రభుత్వ పెద్దలు చెప్పడం లేదు.

### ధాన్యం, పత్తి కొనుగోళ్లలో తిరకాసు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యాసంగి ధాన్యానికే రూ.500 బోనస్ అని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. యాసంగి ధాన్యం బోనస్‌కూ ఎగనామం పెట్టారు. వానకాలంలో ఇస్తామని చెప్పి అందులోనూ పెద్ద తిరకాసు పెట్టారు. అత్యధిక రైతులకు ప్రయోజనం కలిగే దొడ్డురకం వడ్లను వదిలేసి కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ అని ప్రకటించారు. ఆ సన్నాలు కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే అని లింక్ పెట్టారు. సన్నాలు ఎన్నడూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాఖలాలు లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకునే బోనస్‌కు ఎగనామం పెట్టేలా నిబంధనలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారు. ఇక దొడ్డురకం ధాన్యాన్ని సైతం సకాలంలో కొనుగోళ్లు జరుపకపోవడంతో రైతులు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2వేలకే క్వింటాలు చొప్పున నేరుగా మిల్లర్లకు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇక పత్తి పంటల కొనుగోలు సైతం చిత్ర విచిత్ర నిబంధనలతో రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఆలస్యంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెట్టి, తేమశాతం నిబంధనలతో రైతులను దళారులకే పత్తి విక్రయించేలా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### మిగతా హామీలు ఎప్పుడో...

ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకైక పథకం మహిళలకు ఉచిత బస్సు మాత్రమే. ఉచిత బస్సు పేరుతో పథకాన్ని ప్రారంభించి నల్లగొండ రీజియన్ పరిధిలోని అనేక రూట్లలో బస్సులను రద్దు చేశారు. ఇక ఉన్న బస్సుల్లో కిక్కిసిరిపోయి ప్రయాణికులు విసుగు చెందే పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపైనా ప్రజల్లో సంతృప్తి మాత్రం కనిపిస్త లేదు. ఇక 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 500 రూపాయల గ్యాస్ రాయితీ పథకాలు అమలు చేస్తున్నా... ఇంకా వేలాది మంది అర్హులు వీటికి దూరంగా ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల వల్ల కొత్తగా అర్హులను నమోదు చేసుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్న పథకం నేటికీ అడ్రస్సు లేదు. రూ.4వేలకు పెన్షన్ల పెంపు ఊసేలేదు. ఎప్పుడిస్తారో దీనిపై మాట్లాడే వారే కనిపిస్తలేరు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు అధికారంలోకి రాగానే రెండు డీఏలు ఇస్తామని చెప్పి ఒక్క డీఏతోనే సరిపెట్టారు. ఇలా పెండింగ్‌లో ఉన్న డీఏలు ఐదుకు పెరుగడం విశేషం. రిటైరైన ఉద్యోగులకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఈ ఏడాది కాలంలో ఒక్కరికీ ఇవ్వలేదు. ఇక వేతనాల సవరణ గురించి చర్చే లేదు. ఇలా ఎన్నో పథకాలు కార్యరూపం దాల్చలేదు.

### సాగునీటి విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ఈ సీజన్‌లో నాగార్జునసాగర్‌లో గేట్ల మీద నుంచి నీళ్లు దూకుతున్నా... ఏఎంఆర్పీ ఆయకట్టుకు సకాలంలో సాగునీరు ఇవ్వలేకపోయారని ఎన్నోసార్లు రైతులు రోడ్డెక్కారు. ఏఎంఆర్పీలో ఓ మోటార్ రిపేర్ వస్తే దాని పూర్తి చేసేందుకు 9 నెలల సమయం పట్టడంతో రైతులు సాగునీటి కోసం తండ్లాడి తీవ్రంగా నష్టపోయారు. సాగర్ ఎడమ కాల్వకు గండి పడితే 20 రోజుల తర్వాత మరమ్మతులు పూర్తి చేస్తే 30వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. గత యాసంగిలో భూగర్భ జలాలు పడిపోతే సాగర్‌లోని నీటిని వాడుకుని చెరువులు నింపే అవకాశం ఉన్నా... పట్టించుకోలేదు. దీంతో వందలాది ఎకరాల్లో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు.

### విజయోత్సవాల ఊపేది?

ఏడాది ప్రజా పాలన విజయోత్సవాల పేరుతో ప్రభుత్వం వేడుకల నిర్వహణకు సిద్ధపడింది. ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల రెండో వారం వరకు నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా నేడు నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో విజయోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి మంత్రులు హాజరువుతున్నట్లు ప్రకటించారు. ఈ ఉత్సవాల పట్ల సామాన్య ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు సైతం ఆసక్తి చూపడం లేదన్నది నిజం. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజలు పాలన పట్ల సంతృప్తి లేకుండా... విజయోత్సవాలు ఏమిటన్న చర్చ ఆ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తున్నది. ఇక సామాన్య ప్రజలు, వివిధ వర్గాలు, రైతులు, ఉద్యోగులు సైతం విజయోత్సవాల పట్ల పెదవి విరుస్తూ విస్మయం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఆచరణలో వైఫల్యం చెంది, ప్రచారంలో ఆర్భాటం ఎందుకన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ట్రైనీ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఎస్పీలు శరత్ చంద్ర పవార్, సన్‌ప్రీత్ సింగ్

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- పోలీసులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి
- రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబు
- నల్లగొండలో ట్రైనీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్



శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

నీలగిరి, నవంబర్21 : అంకితభావం, క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్ బాబు అన్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో గురువారం సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలకు చెందిన 265 మంది ఏఆర్ కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల పాటు ఎంతో కఠోర శ్రమను ఓర్చుకొని కానిస్టేబుల్స్ శిక్షణను పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ పూర్తి చేసుకున్నారని, నూతన ఉత్సాహంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే దేనినైనా ఎదుర్కోగలమని చెప్పారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ఎస్పీలు శరత్‌చంద్ర పవార్, సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుల్స్ విధి నిర్వహణలో చాలా చురుకుగా ఉండాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూనే శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. అనంతరం శిక్షణ కాలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బెల్ ఆల్‌రౌండర్ జె.అనిల్, బెస్ట్ ఇండోర్ ఆర్. మహేశ్, బెస్డ్ డోర్ ముజిబుద్దీన్, బెస్ట్ ఫైర్ టి. ప్రశాంత్, పరేడ్ కమాండర్ నరేశ్‌కు అవార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా తమ కుటుంబ సభ్యులతో ట్రైనీ కానిస్టేబుళ్లు సంతోషంగా గడిపారు. అంతా కలిసి భోజనం చేసి, ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములునాయక్, రమేశ్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు డానియల్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, హరిబాబు, శ్రీను, సంతోష్, ఎస్ఐలు ప్రవీణ్, శ్రీనివాస్, భరత్, ఆర్ఎస్ఐ అఖిల్‌చంద్ర, పోలీస్ అధికారుల సంఘం నాయకులు జయరాజు, సోమయ్య ఇండోర్, అవుట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న తన కొడుకును ఆప్యాయంగా ముద్దాడుతున్న తల్లి



కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగుతున్న ట్రైనీ కానిస్టేబుల్



ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

## సర్వే డేటా ఎంట్రీ నమోదులో తప్పులు రావద్దు


- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 21 : సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. దరఖాస్తు ఫామ్‌లను జాగ్రత్తగా ట్రంక్ పెట్టెలో భద్రపరచాలని తెలిపారు. జిల్లాలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఈ శిక్షణ ఎంతో కీలకమని, వారు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేలో యాదాద్రి జిల్లా 5వ స్థానంలో ఉందని, ప్రజల సహకారం, ఎన్యుమనేటర్ల కృషితో వేగవంతంగా జరుగుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి శోభారాణి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి శామ్యూల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు సంబంధించి ఈఈలు, డీఈలు, ఏఈలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన రాజాపేట ఏఈ టి.శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి ఉన్నారు.

## ప్రారంభించిన పనులు మళ్లీ ప్రారంభమా? : బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పాండు

భువనగిరి అర్బన్, నవంబర్ 21 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారని, ఎలక్షన్ కోడ్ రావడంతో అవి ఆగిపోయాయని, ఇప్పుడు ఆ పనులను తిరిగి ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని బీఆర్ఎస్ పార్టీ భువనగిరి మండలాధ్యక్షుడు జనగాం పాండు అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చీమలకొండూర్ నుంచి ముస్త్యాలపల్లి వయా సికిందర్‌నగర్ వరకు, బండసోమవారం – వీరవెల్లి, సూరేపల్లి నుంచి పచ్చర్లబోడుతండా వయా చందుగాని తండా, యెర్రంబెల్లి నుంచి కంచనపల్లి వయా మాధవనగర్ వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వాటిని అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రారంభించారని, ఎలక్షన్ కోడ్‌తో అవి నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మళ్లీ ప్రారంభించడం ఆశ్చర్యమేస్తుందన్నారు. కాంగ్రెస్ గెలిచిన తర్వాత 11 నెలల నుంచి మండలానికి ఒక్క రూపాయి అయినా మంజూరు చేయించారా.. కొత్త పనులను ప్రారంభించారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, యూత్, మహిళా భవనాలతోపాటు గ్రామాల్లో ఏ ఒక్క పని లేకుండా పూర్తి చేసి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇప్పటికైనా మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, నాయకులు బీరు మల్లయ్య, సందెల సుధాకర్, అతికం లక్ష్మీనారాయణ, కేశవపట్నం రమేశ్, ఎన్నబోయిన ఆంజనేయులు, వెంకట్, మల్లయ్య, పాండు, శ్రీనివాస్, కృష్ణ, సురేశ్, రమేశ్, నర్సింహ పాల్గొన్నారు.



ప్రగతి చక్ర అవార్డులు పొందిన ఉద్యోగులతో ఆర్ఎం రాజశేఖర్

## సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

- ప్రగతి రథ చక్ర అవార్డులు అందజేసిన ఆర్ఎం రాజశేఖర్

నల్లగొండ సిటీ, నవంబర్ 21 : ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. ఆర్టీసీ ట్రైనింగ్ హాల్‌లో గురువారం రీజినల్ స్థాయి ప్రగతి రథ చక్ర అవార్డులను అందించారు. ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఆర్టీసీ లాభాల బాట పడుతుందన్నారు. ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ సంస్థకు ఎక్కువ ఆదాయం తేవాలని కోరారు. ప్రగతి రథ చక్ర అవార్డులు పొందిన ఉద్యోగులను ఆదర్శంగా తీసుకుని రాబోయే రోజుల్లో ప్రతి ఉద్యోగి అవార్డులు పొందేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం అవార్డుల పొందిన ఉద్యోగులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు మాధవి, శివశంకర్, డిపో మేనేజర్లు శ్రీనాథ, రమేష్‌బాబు, రామ్మోహన్‌రెడ్డి, శ్రీహర్ష, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

భువనగిరి అర్బన్, నవంబర్ 21 : డిసెంబర్ 14న జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడే అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంకు బకాయిల చెల్లింపులు, ట్రాఫిక్ కేసులు, టెలిఫోన్, బ్యాంకులకు సంబంధించి ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## జిల్లాలో వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

నీలగిరి/చిట్యాల, నవంబర్ 21 : జిల్లాలో ఆరోగ్య సంరక్షణ సేవలను అంచనా వేసేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. క్షయనివారణ సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజేశం ఆధ్వర్యంలో పి. సంతోశ్(డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, మెహదీపట్నం) డాక్టర్ స్వాతి(ఫార్మాకాలజిస్టు, జీఎంసీ సిరిసిల్ల), డాక్టర్ పుట్ల శ్రీనివాస్(డీఎంహెచ్ఓ, నల్లగొండ) ముందుగా నల్లగొండ జిల్లాలోని చిట్యాల మండలం వెల్మినేడు పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను, మందులను, ఐఎల్ఆర్ స్టోర్‌ను పరిశీలించారు. అనంతరం నల్లగొండ జనరల్ అసుపత్రి, ఫార్మసీ స్టోర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన మందుల వివరాలు, అందులో ఉన్న స్టాక్, తర రికార్డులను పరిశీలించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ కళ్యాణచక్రవర్తి, ఫార్మసీ సూపర్‌వైజర్ వీరారెడ్డి ఉన్నారు.

# సర్వేతో 'నాస్' నత్తనడక!

## టీచర్లను కుటుంబ సర్వేలో భాగస్వామ్యం చేసిన సర్కార్

- ఒకటే పూట బడితో ఇంటిదారిలో విద్యార్థులు
- విద్యా ప్రమాణాల పెంపునకు ఆటంకం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3వ తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం



రామగిరి, నవంబర్ 21 : విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) ఫలితాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎఫెక్ట్ పడుతున్నది. కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు విధులు కేటాయించిన విషయం విదితమే. దీని కోసం మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటించింది. సర్కార్ ఆదేశాలతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులంతా సర్వేలో నిమగ్నం కావడంతో ఒంటి పూట బడులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఫలితంగా విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసం మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణకు పూర్తి ఆటంకం కలుగుతున్నది. ముఖ్యంగా 3వ తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### డిసెంబర్ 4న నాస్

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేదుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ విద్యా శిక్షణ, రీసెర్చ్ మండలి సంయుక్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)ను నిర్వహిస్తున్నది. దీన్ని తొలి పర్యాయం 2021లో నిర్వహించి ఆయా ఫలితాల ఆధారంగా విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పుల గురించి మండలి, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొవిడ్ అనంతరం దేశ వ్యాప్తంగా జరిపే అతిపెద్ద ప్రతిష్టాత్మక విద్యా సర్వే నాస్–2024ను అన్ని యాజమాన్యాల పాఠశాలలోని 3, 6, 9 తరగతుల చదివే విద్యార్థులకు ఈ ఏడాది డిసెంబర్4న నిర్వహిస్తుంది.

### విద్యార్థుల్లో కనీస విద్యా ప్రమాణాల పెంపుకోసం

విద్యార్థుల్లో భాష, గణితంలో కనీస విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'నాస్'ను అమలు చేస్తుంది. ఈ సర్వేతో వచ్చిన ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. దీని కోసం ఉపాధ్యాయులకు కూడా సర్కార్, విద్యాశాఖ శిక్షణ ఇస్తుంది. ఉపాధ్యాయులు రోజువారీ తరగతులకు ఆటంకం లేకుండా ఉదయం సబ్జెక్టులు బోధించి, మధ్యాహ్నం తర్వాత నాస్ మూల్యాంకనం చేసి వెనుకబడిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ టీచర్లు కుటుంబ సర్వేకు వెళ్తుండటంతో నాస్‌కు తీవ్ర ఆటంకంగా మారిందని పలువురు విద్యా నిపుణులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సర్వేతో శిక్షణ అందించే ఉపాధ్యాయులు విద్యార్థులు దూరం

జాతీయ స్థాయిలో డిసెంబర్ 4న నాస్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో నాస్ మోడల్ టెస్టులు నిర్వహించి ఫైనల్ నాస్ పరీక్షకు విద్యార్థులను ఉపాధ్యాయులు సిద్ధం చేయాల్సి ఉంది. అయితే నవంబర్‌లో ఉపాధ్యాయులంతా ఇంటింటి సర్వేలోనే ఉంటున్నారు. దీంతో విద్యార్థులకు అందించాల్సిన నాస్ శిక్షణపై తీవ్ర ప్రభావం పడటంతో విద్యా సామర్థ్యాల పెంపు కష్టమేనని తెలుస్తుంది. మరో వైపు ఇప్పటి వరకు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించి శిక్షణను పునఃశ్చరణ చేయడానికి కూడా సమయం లేదు. దీంతో జాతీయ స్థాయిలో మన రాష్ట్రం విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తుండం గమనార్హం. మరో వైపు నాస్ ఆశించిన ఫలితాలు రాకుంటే ఉపాధ్యాయులపై ప్రభావం పడుతుందని ఆందోళనలో ఉన్నారు.

### ప్రాథమిక పాఠశాలల్లో 3వ తరగతి విద్యార్థులకే అధిక నష్టం

రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలలోని 3వ తరగతి చదివే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నాస్ ప్రత్యేక శిక్షణ ఉం టుంది. తర్వలో జరిగే నాస్ పరీక్షలో ఆయా పాఠశాలలోని 3, 6 తరగతుల విద్యార్థుల సామర్థ్యాల అచీవ్‌మెంట్‌పై సర్వే ప్రభావం అధికంగా ఉంటుందని చెప్పవచ్చు.

### సర్వేకు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష సిద్ధం

జిల్లా వ్యాప్తంగా నాస్ సర్వే కోసం ఎంపికైన చేసిన పాఠశాలల్లో డిసెంబర్4న నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సర్వం సద్ధం చేశారు. పరీక్ష నిర్వహణలో ఫీల్డ్ ఇన్‌వెస్ట్‌గేటర్స్‌గా జిల్లాలోని డీఈడీ, బీఈడీ చదివే విద్యార్థులను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 28న జిల్లా స్థాయి లో పరీక్ష నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. డీఈఓ బి.భిక్షపతి పర్యవేక్షణలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు.